# ఆర్షపుత్ర శతకము

-డా॥ టి.వి. నారాయణ

తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి

# ఆర్షపుత్ర శతకము

రచన

డా॥ టి.వి. నారాయణ

ప్రచురణ

కార్యనిర్వహణాధికారి

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

2012

# ARSHAPUTRA SATAKAMU

**By**
**Dr. T.V. NARAYANA**

T.T.D. Religious Publications Series No:
© All Rights Reserved

*T.T.D First Edition:- 2012*

Copies: 1000

*Published by :*
**L.V. SUBRAHMANYAM**, I.A.S.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati.

***D.T.P:***
Editor- in- Chief Office,
T.T.D, Tirupati.

*Printed at :*
Tirumala Tirupati Devasthanams Press,
Tirupati

# ముందుమాట

తేట తెలుగుమాటల్లో, ఆటవెలది పద్యాల్లో వెలసిన వేమనశతకాన్ని చదువనివారుగానీ, కనీసం అందులోని ఒకపద్యమైనా నోటికిరానివారుగానీ తెలుగు దేశంలోనే ఉండరని చెప్పడం ఆ శతకానికి గల బహుళవ్యాప్తిని సూచిస్తుంది. "విశ్వదాభిరామ వినుర వేమ" అనే మకుటంతో ఒప్పారే వేమనశతక రచనకు ఆకర్షితులై, భారతదేశంలోని ప్రజలంతా ఆర్షపుత్రులే అనగా ఋషిపుత్రులే అని భావించిన డా|| టి.వి.నారాయణగారు "అవధరింపుమయ్య! ఆర్షపుత్ర!" అనే మకుటంతో ఆటవెలదుల్లో రచించిన శతకమే ఆర్షపుత్ర శతకం. డా|| నారాయణగారు తమ గురువులొద్ద నేర్చుకున్నవీ, స్వాధ్యాయంవల్ల జీర్ణించుకొన్నవీ, అనుభవంచేత అర్థంచేసుకుని జీవితంలో ఆచరించుటకు యత్నం చేసినవీ అయిన సత్యాలను ఈ శతకంలో పొందుపరచినట్లు పేర్కొన్నారు.

వాస్తవంగా అందరూ అవలంబించదగిన గుణాలు, విడువదగిన దోషాలు ఎలాంటివో రచయిత హృద్యమైన తమ ఆటవెలదుల్లో వివరించారు.

డా|| జి.వి. సుబ్రహ్మణ్యం, డా|| దివాకర్ల వేంకటావధాని, డా|| సి. నారాయణరెడ్డి, డా|| నండూరి రామకృష్ణమాచార్య, ఆచార్య తూమాటి దొణప్ప వంటి విద్వాంసుల ప్రశంసలకు పాత్రమైన ఆర్షపుత్రశతకాన్ని రచయిత డా|| టి.వి. నారాయణగారు గతంలో సొంతంగా ప్రచురించారు. ప్రస్తుతం ఆ పుస్తకాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం స్వీయ ప్రచురణగా స్వీకరించి ప్రచురిస్తున్నది.

నీతి ధర్మ ప్రబోధకమై, సులభ సుందర శైలిలో విలసిల్లే ఈ పుస్తకాన్ని పాఠకులు ఆదరిస్తారని ఆశిస్తున్నాను.

సదా శ్రీవారిసేవలో

కార్యనిర్వహణాధికారి,
తి.తి.దేవస్థానములు, తిరుపతి.

DR. T.V. NARAYANA
**MA., M.Ed., PhD.**
**Former First Member of A.P.P.S.C**

**58/3 RT, P.S. Nagar,**
**Hyderabad - 500 457.**
**Ph: 3346388**
**26th January, 1991**

# విన్నపము

శతక సాహిత్యంలో వేమన శతకం తెలుగు ప్రజల నాలుకలయందు ముమ్మరంగా నిలిచింది, జీవించిందన్నది పరమసత్యం. ఈ శతకం నన్ను ఇతోధికంగా ఆకట్టుకొన్నది; సాంఘిక సమతావాద యుక్తమైనది, ఆధ్యాత్మిక తత్త్వ ప్రబోధకమైనదియు అగుట వలన కాబోలు.

వేమన శతకాన్ననుసరించి, తేట తెలుగులో ఆట వెలదులలో ఒక శతకాన్ని రచించాలన్నది కొంతకాలంగా నాహృదిలో మసలుతున్న కోరిక.

ఒకనాడు ప్రార్థనానంతరం ఆలోచిస్తుండగా "అవధరింపుమయ్య ఆర్షపుత్ర" అనే మకుటం స్ఫురణకు వచ్చింది.

నా అభిప్రాయంలో భారత దేశంలోనున్న వారందరు ఋషిపుత్రులే.

నేను గురువుల వద్ద నేర్చుకున్నవి, స్వాధ్యాయం వలన జీర్ణించుకొన్నవి, అనుభవముచేత అర్థంచేసుకొని, జీవితములో ఆచరణలో పెట్టు ప్రయత్నము చేయుచున్న సత్యాలను, సాధ్యమైనంతవరకు ఈ శతకంలో పొందుపరచాలని అనుకున్నాను. ఈ కృషిలో నే నెంతవరకు సఫలీకృతుణ్ణయ్యానో సహృదయులైన బుధవరులు నిర్ణయించాలి.

ఈ కావ్యాన్ని నా ప్రియతమ్ముడు కీ॥శే॥ టి.వి. శంకర రావుకు అంకిత మిచ్చాను. P.W.D. శాఖలో Executive ఇంజనీరుగా పనిచేస్తూ క్యాన్సరు వ్యాధి పీడితుడై చిన్న వయస్సులో (45వయేట) మా కుటుంబాన్ని దుఃఖసాగరములో ముంచి మృత్యువువాతపడినాడు. మా నాన్నగారు పోయినా నేనంత దుఃఖపడలేదు. వారు పోయేనాటికి నా వయస్సు 14 సంవత్సరములు, మా

సోదరుడు శంకరరావు ఈడు 8 సం॥లు. కనిష్ఠుడు శ్రీ టి.వి. దేవదత్ (Retired Joint Labour Commissioner) 5 సంవత్సరములవాడు. మా అమ్మ కీ॥ శే॥ తక్కెళ్ళ నరసమాంబ పాలనలో మేము పెరిగాము. ఎంతో శ్రమకోర్చి మా తమ్ముణ్ణి ఇంజనీరుగా తీర్చిదిద్దినాము. ఉజ్జ్వలమైన భవిష్యత్తు ఉంటుందని అనుకున్నాము. కాని కఠోర కర్కశమైన విధి విలాసము విపరీతంగా పరిణమించింది.

చిననాడు మా నాన్నగారు 'రామ రామ' శతకము, రోజుకొక పద్యం చొప్పున మా తమ్ముడికి నేర్పించేవారు. ఒకసారి విన్నంతనే పద్యం ఒప్పజెప్పేవాడు. అతడు ఏకసంధాగ్రాహి అనే చెప్పాలి.

కాని పాఠశాలకు పోయిన తర్వాత ఉర్దూ రెండవభాషగా నేర్చుకొన్నాడు.

మొదటి కావ్యం పూజ్యులైన మా నాన్నగారికి, రెండవ కావ్యం పరమ పూజ్యురాలైన మా అమ్మగారికి, మూడవ గ్రంథం మా గురువుగారికి అంకితం ఇచ్చాను.

ఈ నా నాల్గవ కావ్యము మా తమ్మునికి అంకిత మిస్తూ నా ప్రేమను ప్రదర్శించుకుంటున్నాను. అతనిని రక్షించుకోలేకపోతిననే బాధ ఈ నాటికి నన్ను పీడిస్తూ ఉంటుంది.

ప్రగతిగీతా ప్రవర్తకులు, తెలుగులోను, ఇంగ్లీషులోను ప్రకాండ పండితులు, మాజీ అధికారభాషాధ్యక్షులు, మిత్రులు డా॥ నండూరి రామకృష్ణమాచార్యులు ఈ గ్రంథరచన యందు చక్కని సలహాల నందించినారు. తమ అభిప్రాయాన్ని కూడా వ్రాసారు. వారికి నే నెంతో ఋణపడియున్నాను.

పండిత ప్రవరులు, మధురవాక్చతురులు సాహితీ విమర్శకా గ్రేసరులు, భక్తా గ్రగణ్యులు, కేంద్ర విశ్వవిద్యాలయ తెలుగు శాఖాధ్యక్షులు, మిత్రులు ఆచార్య శ్రీ జి.వి. సుబ్రహ్మణ్యం గారికి, కవిపుంగవులు, జ్ఞానపీఠ అవార్డు గ్రహీత, తెలుగు విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులు, పరమమిత్రులు ఆచార్య శ్రీ సి. నారాయణరెడ్డి గారికిని నాయీ కావ్యంపై అభిప్రాయములు వ్రాసి నన్ను ప్రోత్సహించినందులకు కృతజ్ఞతలు తెలుపుచున్నాను.

ఈ కావ్యాన్ని ఎంతో ఓపికతో చక్కగా ప్రచురించిన హైటెక్ ప్రింటర్స్ వారికి నా హృదయ పూర్వక ధన్యవాదములు.

బుధజన విధేయుడు

**టి.వి. నారాయణ**

**1**

**పరమ పావనమ్ము భరతదేశము సుమ్ము**
**కణము కణము మేల్మి కాంచనమ్ము**
**పుట్టుచుందు రిచట పూర్వపుణ్యముచేత**
**అవధరింపుమయ్య! ఆర్షపుత్ర!**

**2**

**వేద విద్య లెల్ల వెలసె నిచ్చోటనే**
**ఉపనిషత్తు లిచట ఉద్భవించె**
**అవతరించి రిచట – వ్యాసుండు వాల్మీకి**
**అవధరింపుమయ్య! ఆర్షపుత్ర!**

**3**

**ఆదరించి రిచట ఆదికాలమునుండి**
**ఆస్తికులను వోలె నాస్తికులను**
**పరమళించె నిచట భావపుష్పము లెన్నొ**
**అవధరింపుమయ్య! ఆర్షపుత్ర!**

**4**

**కలవు రెండు విధులు తిలకించి చూడంగ**
**ఖేద మిచ్చుచుండు ముందు ఒకటి**
**అంతమందు నిచ్చు ఆనంద మమితమ్ము**
**అవధరింపుమయ్య! ఆర్షపుత్ర!**

**5**

మొదట ముదము నిచ్చి తుదకు ఖేదము నిచ్చు
ఇంక నొకటి అరయ నిర్ధరిత్రి
తళుకు బెళుకు ముందు – తరువాత దుఃఖమ్ము
అవధరింపుమయ్య! ఆర్షపుత్ర!

**6**

ముందు ఖేదమిచ్చి మోదమ్ము తర్వాత
పొసగు విధము నరయ పొందువలయు
వదలవలయు ముందు ముదము నిచ్చెడి రీతి
అవధరింపుమయ్య! ఆర్షపుత్ర!

**7**

ఆత్మ అమర మెపుడు ఆనంద ధామమ్ము
ఆత్మయందు తుష్టి ఆత్మచేత
పొంద నేర్చువాడె పొందు సర్వస్వమ్ము
అవధరింపుమయ్య! ఆర్షపుత్ర!

**8**

రణము నందు గెల్చి రాణించు యోధుండు
పరిధి యున్న యట్టి ధరణి నేలు
మనసు గెల్చు నతడు మహినెల్ల గెల్చురా
అవధరింపుమయ్య! ఆర్షపుత్ర!



**9**

మాతృ వందనమ్ము పితృ వందనమ్మును
గురువు వందనమ్ము మరువరాదు
అట్టి వాని కొదవు ఆనంద సౌఖ్యమ్ము
అవధరింపుమయ్య! ఆర్షపుత్ర!

**10**

ఆత్మ గౌరవమ్ము అఖిల సంపదలందు
గొప్పదంచు బుధులు చెప్పిరయ్య
కుదువ బెట్టవద్దు పదవికోసము దాని
అవధరింపుమయ్య! ఆర్షపుత్ర!

**11**

పరుల దోషములను పరికించి పరికించి
చాటి చెప్ప మనకు పాటి గాదు;
మంచి గలుగు మనకు మన దోషములె యెన్న
అవధరింపుమయ్య! ఆర్షపుత్ర!

**12**

శత్రువైనవాడు క్షమవీడి చూపించు
తప్పులన్నియెన్ని తరచి తరచి
అతడె గొప్పవాడు ఆప్త మిత్రుని కంటె
అవధరింపుమయ్య! ఆర్షపుత్ర!

**13**

విఙ్ఞ వీగవద్దు విజయమ్ము సిద్ధింప;
నీల్గవద్దు కలిమి కల్గినపుడు;
సర్వమిచ్చువాడు సర్వేశ్వరుండెగా
అవధరింపుమయ్యణ ఆర్షపుత్ర!

**14**

మూర్ఖుతోడి చెలిమి ముప్పు తెచ్చును సుమ్ము
మంచివారి తోడ మాట దెచ్చు
పరువుదీయు తుదకు ప్రాణమ్ము హరియించు
అవధరింపుమయ్య! ఆర్షపుత్ర!

**15**

చంచలమ్ము మనసు సతతమ్ము పరుగెత్తు
విషయ సుఖ వినోద విపణి వీథి
మనసు నిగ్రహించు మనుజుడే ధీరుండు
అవధరింపుమయ్య! ఆర్షపుత్ర!

**16**

నీదు దీన దశకు నీవె హేతువు సుమ్ము
ఉన్నతికిని అట్లె ఉర్విలోన;
నీదు భాగ్యరేఖ నీవె గీయుదు వోయి
అవధరింపుమయ్య! ఆర్షపుత్ర!



**17**

కర్మఫలము దాట కర్మకే తగునయ్య
తమ్మిచూలి గూడ దాటలేడు;
తప్పదనుభవింప తనువు దాల్చిన వాడు
అవధరింపుమయ్య! ఆర్షపుత్ర!

**18**

పరుషవాక్య మెపుడు పలుకగూడదు సుమ్ము;
తప్పు తలపు లెపుడు తలప రాదు;
చేటు చేయు పనులు చేయబూనకుమయ్య!
అవధరింపుమయ్య! ఆర్షపుత్ర!

**19**

దేహ మాత్మ యొక్క గేహమ్ము తలపోయ
అద్దె కొంప ఇద్ది అవని మీద;
తినెడి భోజనమ్ము దీని బాడుగ సుమ్ము
అవధరింపుమయ్య! ఆర్షపుత్ర!

**20**

గాలి భూమి జలము గగనంబు అనలమ్ము
ఎవరి అబ్బ సొత్తు ఎంచి చూడ?
సర్వజనుల సొమ్ము సవ్యంబుగా చూడ
అవధరింపుమయ్య! ఆర్షపుత్ర!

**21**

సమతలేని యట్టి సంఘమం దరయంగ
రాదు ఐక్యమెపుడు రాదు రాదు;
బలము ఎంత యున్న పలుచనై పడిపోవు
అవధరింపుమయ్య! ఆర్షపుత్ర!

**22**

ఊరు మంచి దగును నోరు మంచిది యైన
మధురమైన మాట మంచి పెంచు;
కఠినమైన పలుకు కక్ష పెంచుట కద్దు
అవధరింపుమయ్య! ఆర్షపుత్ర!

**23**

కానుపింప డెపుడు కష్టమ్ము దర్శింప
దీనబాంధవుండు దేవళముల
వెలుగుచుండు నతడు వెతలొందు జనులందు
అవధరింపుమయ్య! ఆర్షపుత్ర!

**24**

నేడు పేద రేపు రేడుగా రూపొందు
రేడు నేడు అగును రేపు పేద
శాశ్వతమని దేని విశ్వసింపకుమయ్య!
అవధరింపుమయ్య! ఆర్షపుత్ర!



**25**

పండితోత్తమునకు పరమబ్బ బోదయ్య
భక్తిలేని యెడల ముక్తి రాదు;
సాధకునకు ముక్తి సాధ్యమై పొలుపొందు
అవధరింపుమయ్య! ఆర్షపుత్ర!

**26**

ఈర్ష్య లేనివాడు ఈశానుభక్తుండు
మమత లేనివాడు మాన్యవరుడు
అహము లేనివాడు ఆనందధాముండు
అవధరింపుమయ్య! ఆర్షపుత్ర!

**27**

మహిని ధనముచేత మర్యాద గొనవచ్చు
పదవులు గొనవచ్చు పదియునారు;
ధనము వలన గాని పనులేమి లేవయ్య
అవధరింపుమయ్య! ఆర్షపుత్ర!

**28**

మంచి యెపుడు నిజము మంచి పెంపొందించు
చెడ్డ పరిణమించు చెడుగుగానె;
మంచి పెంచుచుంట మనుజధర్మము సుమ్ము
అవధరింపుమయ్య! ఆర్షపుత్ర!

**29**

ధనమె గొప్ప బలము ధనమే మహాశక్తి
ధనము గలుగువాడు ధన్యజీవి;
ధనము లేనివాడు ధరమీద హీనుండు
అవధరింపుమయ్య! ఆర్షపుత్ర!

**30**

సత్యవచనములను చాటి చెప్పగవచ్చు
పరమ దుర్లభమ్ము పాటి చేయ;
పాటి చేయువాడు పరమపూజ్యుం డౌను
అవధరింపుమయ్య! ఆర్షపుత్ర!

**31**

ఆశలేక ఇచ్చునట్టిదే దానమ్ము;
శ్రేష్ఠమైన యట్టి చేష్ట మఖము;
కోరికలను మాడ్చుకొనుటె వైరాగ్యమ్ము
అవధరింపుమయ్య! ఆర్షపుత్ర!

**32**

సుఖము వెంటనుండు చూడగా దుఃఖమ్ము
దుఃఖ మరయ సుఖముతోడ నుండు;
రెండు నేలువాడె రేడు జగత్తులో
అవధరింపుమయ్య! ఆర్షపుత్ర!



**33**

కలిమి లేములందు కలసి యుండెడి వాడె
నిక్కమైన యట్టి నేస్తమయ్య!
కలిమివేళ ఉండు కాలాంతకుడు సుమ్ము
అవధరింపుమయ్య! ఆర్షపుత్ర!

**34**

యజ్ఞమయము చేయ యత్నింపవలెనయ్య
చిత్తశుద్ధితోడ జీవితమ్ము;
శుభము గల్గు తనకు శుభము విశ్వమునకు
అవధరింపుమయ్య! ఆర్షపుత్ర!

**35**

పూర్ణమైన శక్తి పూర్తిగా విశ్వమ్ము
బయటలోన నిండి పరగుచుండు;
మాత పాపనట్లు మనల సంరక్షించు
అవధరింపుమయ్య! ఆర్షపుత్ర!

**36**

సతము పాపయెట్లు యతనమ్ము చేయునో
తల్లి యొడిని చేర తరలి తరలి
చేరవలెను అటులె జీవుండు పరమాత్మ
అవధరింపుమయ్య! ఆర్షపుత్ర!

**37**

ఎల్లలేవి లేక ఎల్లవేళలయందు
శాంతిధామమైన శక్తి పొరలు
అనుభవింపవచ్చు హక్కుగా జనులెల్ల
అవధరింపుమయ్య! ఆర్ష పుత్ర!

**38**

ఆది మధ్యలేక అంతమ్ము లేకుండ
బ్రహ్మశక్తి సతము పరగుచుండు;
దొరకు నయ్య! అద్ది వరియించు వారికే
అవధరింపుమయ్య! ఆర్షపుత్ర!

**39**

ఎట్లు తలపులుండు అట్లె మానసముండు;
మనసు ఉండునట్లు మనుజు డుండు;
మనుజు లుండునట్లు మనుజసంఘము లుండు
అవధరింపుమయ్య! ఆర్షపుత్ర!

**40**

తోటి మానవులను పాటి చేయనివాడు
ఎంతవాడయినను ఏమి ఫలము?
అంటరానివాడు అటువంటి వాడెరా
అవధరింపుమయ్య! ఆర్షపుత్ర!



**41**

మంచి కర్మ యెపుడు మంచినే చేకూర్చు
చెడ్డ కర్మ సతము చెడుగు చేయు;
కర్మ కెప్పు డెట్టి కక్షయే లేదయ్య!
అవధరింపుమయ్య! ఆర్షపుత్ర!

**42**

నోటినుండి వెడలు మాట వెన్కకు రాదు
వదలి పెట్టినట్టి బాణమట్లు;
తప్పుమాటలాడి తపియింపగా నేల?
అవధరింపుమయ్య! ఆర్షపుత్ర!

**43**

పూర్వ పరిచయమ్ము బొత్తిగా లేనట్టి
వారు చూపు వలపు వలపుగాదు
మోసమేను; కడకు ముప్పుదెచ్చును సుమ్ము;
అవధరింపుమయ్య! ఆర్షపుత్ర!

**44**

అమలు చేయలేని ఆదర్శముల జెప్పి
మోసపుచ్చవద్దు మోటు జనుల;
అర్థమైననాడు అంతు తేల్చెదరయ్య!
అవధరింపుమయ్య! ఆర్షపుత్ర!

**45**

విషయ విపణినుండి విడదీసి మనసును
సంధి చేసికొనుము సామితోడ;
అవధిలేని గొప్ప ఆనంద మొదవును
అవధరింపుమయ్య! ఆర్షపుత్ర!

**46**

మనసు నిలిపి చేయు పనులన్ని పూజలే
దీనజనులసేవ దివ్యజపము;
పతిత జనుల బాగుపరచుటే యోగమ్ము;
అవధరింపుమయ్య! ఆర్షపుత్ర!

**47**

కోప మెప్పుడైన కోపమ్మునే పెంచు
అగ్నియందు పడిన ఆజ్యమట్లు
బూది సేయగలదు బుద్ధినంతటి గూడ
అవధరింపుమయ్య! ఆర్షపుత్ర!

**48**

అంతరాత్మ ఆజ్ఞ ఆలకించెడువాడు
ఎదుగుచుండు సతము ఎదురులేక
శక్తి పొందు పొందు ముక్తి సంపద గూడ
అవధరింపుమయ్య! ఆర్షపుత్ర!



**49**

అహము నిండియున్న అజ్ఞాని యేనాడు
శిష్టమైన మాట ఇష్టపడదు;
పంది ఇష్టపడునె పన్నీటి నెత్తావి?
అవధరింపుమయ్య! ఆర్షపుత్ర!

**50**

కలిసి బ్రతుకదగును కాకిమూకల వోలె
మనుజులెల్ల ధనము పంచుకొనుచు
సమత ఐకమత్య సౌభ్రాత్రములతోడ;
అవధరింపుమయ్య! ఆర్షపుత్ర!

**51**

అమరియుండ వెపుడు ఆస్తు లెవ్వరివెంట
శ్వాస నిలువబోదు శాశ్వతముగ;
మనము చేయు కర్మ మన వెంటనే వచ్చు
అవధరింపుమయ్య! ఆర్షపుత్ర!

**52**

రప్పలోని కప్ప చిప్పలో ముత్యమ్ము
కంటిలోని పాప మింటి చుక్క
సృష్టి కర్త తప్ప సృష్టించ లేడయా
అవధరింపుమయ్య! ఆర్షపుత్ర!

**53**

మనిషి జన్మచేత మాన్యుండు కాలేడు
నీచు డెపుడు కాడు నిజము నరయ;
కర్మచేత నరుడు ఖలుడౌను మాన్యుడౌ
అవధరింపుమయ్య! ఆర్షపుత్ర!

**54**

సంఘసేవచేయు సహకార మొప్పార
చిన్నదైన గాని చీమ యెపుడు;
మనుజు డట్లుచేయ మాన్యుడై యొప్పారు
అవధరింపుమయ్య! ఆర్షపుత్ర!

**55**

త్యాగనిరతి లేని తపము లాభము లేదు
వినయ రహితమైన విద్య బరువు;
ముక్తి బడయనట్టి భక్తి వ్యర్థము సుమ్ము
అవధరింపుమయ్య! ఆర్షపుత్ర!

**56**

కోరి తెచ్చుకున్న కోరికల్ జగతిలో
దుఃఖ కారణములు తుట్టతుదకు
కోర్కె లుడుగ నిండు గుండె నానందమ్ము;
అవధరింపుమయ్య! ఆర్షపుత్ర!



**57**

నేలమీద మనిషి నివసింపవలెగాని
ఊహజాలమందు ఊగరాదు;
గాలి ఊహలన్ని గగనపుష్పమ్ములే
అవధరింపుమయ్య! ఆర్షపుత్ర!

**58**

ముందు గడియయందు మూడునట్టిది యేదొ
నరుని కెట్లు తెలియు ధరణి మీద;
వశముగాదు తెలియ వాగీశునకు గాని
అవధరింపుమయ్య! ఆర్షపుత్ర!

**59**

నిన్ను నీవు తెలిసికొన్ననాడే సుమ్ము
విదిత మగును నీకు విశ్వమెల్ల;
విశ్వకర్మ తెలియ విశ్వమ్ము నెరుగంగ
అవధరింపుమయ్య! ఆర్షపుత్ర!

**60**

మనసు దేనియందు మగ్నమైయుండునో
అదియెపొందు మనిషి అరసిచూడ;
మనసు నిల్పుమయ్య మంచి చేయుటయందు
అవధరింపుమయ్య! ఆర్షపుత్ర!

**61**

భద్రపరచినట్లె బ్యాంకులో ధనరాశి
సంచయించునయ్య మంచి కర్మ
అవసరమ్ము తీర్చు అదనులో చెయిచేరి
అవధరింపుమయ్య! ఆర్షపుత్ర!

**62**

అవసరాల నెంత అర్థమ్ములేకుండ
పెంచుకొనునొ మనిషి హెచ్చుగాను
అంత బాధపడును అవసానదశయందు
అవధరింపుమయ్య! ఆర్షపుత్ర!

**63**

మూఢనమ్మకాల ముఠికి కాలువలందు
ముదముతోడ మునుగు మూఢజనుడు
సత్యధర్మ మనెడు సంద్రమ్ము నెటుచేరు?
అవధరింపుమయ్య! ఆర్షపుత్ర!

**64**

తోటి జనులనెల్ల దోపిడీచేయుచు
కూడబెట్టు ధనము క్రుళ్లిపోవు;
ముందుకాలమందు ముప్పుదెచ్చును సుమ్ము
అవధరింపుమయ్య! ఆర్షపుత్ర!



**65**

కామియైన వాడు కనలేడు వరుసలు
కాన డొరుల మాన ప్రాణమైన
మత్తు గల్గియుండు మరచిపోవును తన్నె
అవధరింపుమయ్య! ఆర్షపుత్ర!

**66**

పాత దనుచు దేని పారవేయకు మయ్య!
క్రొత్త దనుచు దేని కోరవలదు;
ఎంచి రెంటిలోని మంచినే గైకొమ్ము
అవధరింపుమయ్య! ఆర్షపుత్ర!

**67**

కరుడు గట్టినట్టి కర్మవాసన లెల్ల
మనసులోతులోన మసలుచుండి
మరలచేయు నరుల మలిన కర్మల వైపు
అవధరింపుమయ్య! ఆర్షపుత్ర!

**68**

స్వాంతమందె యుండు శాంతధామము సుమ్ము
వెఱ్ఱితనము దాని వెదక బయట;
అంతరాత్మలోన ఆనంద మున్నది
అవధరింపుమయ్య! ఆర్షపుత్ర!

**69**

**శక్తినిచ్చునట్టి భుక్తియే మేలయ్య!**
**కుడుపు నింపునట్టి కూడుగాదు**
**అనుభవైకవిద్య అధ్యాత్మయోగంబు**
**అవధరింపుమయ్య! ఆర్షపుత్ర!**

**70**

**పూర్తియైన పనులు పూర్తిగానివి కూడ**
**జరుగుచుండు ఈశు కరుణవలన;**
**ఈవు మరియు నేను హేతువుల్ కాముర!**
**అవధరింపుమయ్య! ఆర్షపుత్ర!**

**71**

**ఆదరించ దగును ఆశ్రయించెడి వారి**
**చేతనైన మేలు చేయవలెను;**
**చెట్టు ఆదరించు చేరు పిట్టలనెల్ల**
**అవధరింపుమయ్య! ఆర్షపుత్ర!**

**72**

**నీవు మనసుకాదు; నీవు తెల్వివి కాదు;**
**దేహ మసలు కాదు తేటిచూడ;**
**స్వామి నీవు సుమ్ము సాధనాలవి నీకు**
**అవధరింపుమయ్య! ఆర్షపుత్ర!**



**73**

**ప్రేమ మయము సుమ్ము విశ్వమంతయు చూడ**
**అణువు అణువు సతము అలరు నందు**
**ప్రేమ సాగరుండు విశ్వదాతయె యెంచ**
**అవధరింపుమయ్య! ఆర్షపుత్ర!**

**74**

**కాలగతిని ఆప కాదురా సాధ్యమ్ము**
**జయము కోరువారు జగతియందు**
**కర్మచేయవలెను కాలానుగుణముగా;**
**అవధరింపుమయ్య! ఆర్షపుత్ర!**

**75**

**నవ్వవలెను కదలు మువ్వగజ్జెలవోలె**
**నవ్వవలెను వెలుగు దివ్వెవోలె;**
**నవ్వు బలమునిచ్చు నవ్వె ఔషధ; మయ్య!**
**అవధరింపుమయ్య! ఆర్షపుత్ర!**

**76**

**మనము మారకుండ మారునా విశ్వమ్ము?**
**మార్చగోరువారు మారవలెను;**
**మనము మార్పుచెంద మారురా మహియెల్ల**
**అవధరింపుమయ్య! ఆర్షపుత్ర!**

**77**

ఆత్మగౌరవమ్ము ఆవశ్యకము సుమ్ము
కూడుగుడ్డ ఇల్లు కూడ వలయు;
స్వర్గ మెందుకయ్య! స్వాతంత్ర్యమే లేక?
అవధరింపుమయ్య! ఆర్షపుత్ర!

**78**

నుడికి నడతకెపుడు ఎడముండ వలదోయి
తలపులుండునటుల పలుక వలయు;
పలుకు ననుసరించి పనిచేయ దగునయ్య!
అవధరింపుమయ్య! ఆర్షపుత్ర!

**79**

మహిమ ఉన్నదోయి మందహాసమునందు
శత్రువులను గెల్చు; సఖుల గూర్చు;
చుట్టునున్న జనుల చుట్టాలుగా చేయు;
అవధరింపుమయ్య! ఆర్షపుత్ర!

**80**

తప్పుచేయవద్దు ధర్మమార్గము తప్పి;
తప్పుచేయవద్దు కప్పిపుచ్చి;
తప్పుచేసినపుడు ఒప్పుకొనుట మేలు
అవధరింపుమయ్య! ఆర్షపుత్ర!



**81**

సర్వజనులనెల్ల సంతోషవదనమ్ము
క్షణములోన పరవశమ్ము చేయు;
ఖర్చులేని గొప్ప కాయకల్పక మద్ది
అవధరింపుమయ్య! ఆర్షపుత్ర!

**82**

మంచి యెక్కడైన మంచి యెప్పుడుగాని
మంచి మనసుతోడ మంచి మిగుల
మంచి చేయవలెను మానవాళికి నీవు;
అవధరింపుమయ్య! ఆర్షపుత్ర!

**83**

సంఘమందు సమత సాధింపబడకున్న
శాంతి కల్గదనుట సత్యమయ్య!
హెచ్చుతగ్గులుండ హెచ్చేను ఘర్షణల్
అవధరింపుమయ్య! ఆర్షపుత్ర!

**84**

వర్ణభేద ముడిగి వర్గభేదము వీడి
సమత గల్గి మనెడు సంఘమందు
శాశ్వతముగ నుండు శాంతి భద్రతలోయి!
అవధరింపుమయ్య! ఆర్షపుత్ర!

**85**

**తిండి అవసరమ్ము దేహపుష్టికి సుమ్ము;
వసన మవసరమ్ము వాన చలికి;
స్వేచ్ఛ అవసరమ్ము జీవి సౌఖ్యానికి;
అవధరింపుమయ్య! ఆర్షపుత్ర!**

**86**

**భూమి పగులగొట్టి పుట్టు విత్తును చూడు
అగును మొక్క తుదకు అగును చెట్టు
అట్లె పెరుగుమయ్య! అవరోధములు దాటి
అవధరింపుమయ్య! ఆర్షపుత్ర!**

**87**

**ప్రకృతి సూత్రములను పాటించు జనులెల్ల
రోగరహితు లగుచు సాగుచుంద్రు;
అనుభవింతు రెపుడు ఆరోగ్య సౌఖ్యమ్ము
అవధరింపుమయ్య! ఆర్షపుత్ర!**

**88**

**శక్తి లేనివాడు భుక్తికే కొరగాడు
శక్తి లేకయున్న ముక్తిరాదు
శక్తి సంగ్రహించి సాధించు విజయమ్ము
అవధరింపుమయ్య! ఆర్షపుత్ర!**



**89**

**కదలకుండ నుండు కదలు చుండును సదా
స్థూలమద్ది మరియు సూక్ష్మతమము
నిండియుండునద్ది నీలోన నాలోన
అవధరింపుమయ్య! ఆర్షపుత్ర!**

**90**

**బ్రహ్మతత్త్వమద్ది బయటలోపల నుండు;
అన్ని వస్తులందు అమరియుండు;
మనకు దగ్గరుండు మనకు దూరముకూడ;
అవధరింపుమయ్య! ఆర్షపుత్ర!**

**91**

**సర్వభూతములను సాక్షాత్తు తనయందు
తనను సకలభూత తతులయందు
చూచువాడు మనము చూడగా దగువాడు;
అవధరింపుమయ్య! ఆర్షపుత్ర!**

**92**

**పాడుచేయవద్దు పర్యావరణ మెప్డు
వృక్షములను పెంచి వృద్ధిపరచు;
సలుప యజ్ఞవిధులు తొలగు కాలుష్యమ్ము
అవధరింపుమయ్య! ఆర్షపుత్ర!**

**93**

**గాలి నేల జలము గగనమ్ము అనలమ్ము**
**ఎవడు సృష్టిచేసె అవనియందు;**
**వాడె ప్రభువు సుమ్ము; వానికే జేజేలు**
**అవధరింపుమయ్య! ఆర్షపుత్ర!**

**94**

**జ్ఞానసాగరమ్ము ఆనందధామమ్ము**
**శక్తి నిధియు నద్ది శాంతి ఖనియు**
**పరమ ధామమైన ప్రణవనాదము సుమ్ము**
**అవధరింపుమయ్య! ఆర్షపుత్ర!**

**95**

**హింసవలన కలుగు ఎట్టి మేలైనను**
**ఉండబోదు తిరము ఉర్వీమీద;**
**హింస యెంచిచూడ హింసనే పుట్టించు**
**అవధరింపుమయ్య! ఆర్షపుత్ర!**

**96**

**మనకు సంక్రమించు ధనము సర్వస్వమ్ము**
**మనకె కాదు సుమ్ము మనదె కాదు**
**సంఘమందు ఉన్న సర్వప్రజల దద్ది;**
**అవధరింపుమయ్య! ఆర్షపుత్ర!**



**97**

**తనకు వచ్చినట్టి తనకు నచ్చిన యట్టి**
**వృత్తి నెన్నుకొనుట ఉత్తమమ్ము;**
**కాయికమ్ము ఇచ్చు కైలాస సౌఖ్యమ్ము**
**అవధరింపుమయ్య! ఆర్షపుత్ర!**

**98**

**వృత్తి యేదియైన ఉత్తమం బైనదే**
**వేదపఠనమైన విపణియైన**
**చిత్త శుద్ధిగలిగి చేయగావలెగాని**
**అవధరింపుమయ్య! ఆర్షపుత్ర!**

**99**

**బోధ గురులు కలరు భూమిపై పెక్కండ్రు**
**ఆచరించువార లరుదు గాదె;**
**ఆచరించువారె అసలైన గురులోయి!**
**అవధరింపుమయ్య! ఆర్షపుత్ర!**

**100**

**చదువవలెను సతము సద్గ్రంథముల నీవు**
**వృద్ధి పొందగలదు బుద్ధి నిజము;**
**మార్గదర్శకములు మంచి పుస్తకములే;**
**అవధరింపుమయ్య! ఆర్షపుత్ర!**

**101**

మంచి ఆశయాలు మాత్రమే జగతిలో
ఏమిచేయగలవు? యెంచిచూడ
కార్యరూప మొంద కలిగించు సౌఖ్యమ్ము
అవధరింపుమయ్య! ఆర్షపుత్ర!

**102**

తిరుగుచుండు భూమి తెరపిలేకుండగా
అనిలు దటులె వీచు ఆగకుండ;
చేయవలెను కర్మ జీవితాంతము దాక
అవధరింపుమయ్య! ఆర్షపుత్ర!

**103**

కన్య పెద్దదైన కన్నవారల వీడు,
ఫలము చెట్టు వీడు పక్వమైన,
జ్ఞాని వదలవలెను సంసార మట్టులే!
అవధరింపుమయ్య! ఆర్షపుత్ర!

**104**

బుద్ధిలేక కర్మ వృద్ధికాలేదయ్య!
కర్మ చేయరాదు కాంక్షతోడ;
బుద్ధి కర్మ కలిసి భువనమ్ము పాలించు
అవధరింపుమయ్య! ఆర్షపుత్ర!



**105**

వృక్షజాల మెట్లు రక్షించు రంజించు
మంచి వాయు విచ్చి మనుజతతిని;
మంచి పెంచవలెను మహిని మానవు లట్లె
అవధరింపుమయ్య! ఆర్షపుత్ర!

**106**

ఇల్లుకట్టువాని కిల్లువాకిలి లేదు;
కర్షకునకు లేదు కష్టఫలము;
కార్మికునకు లేదు కామితార్థము సుమ్ము;
అవధరింపుమయ్య! ఆర్షపుత్ర!

**107**

విద్య అర్థమైన వినియోగపడుగాని
ఓటిదైన చదువు బూటకమ్ము;
బువ్వ జీర్ణమైన పుష్టి చేకూర్చురా
అవధరింపుమయ్య! ఆర్షపుత్ర!

**108**

సకల దుఃఖములకు సరియైన హేతువు
సోమరితనమంద్రు; భూమి ప్రజకు
మోక్ష మనిన ఏమి? దక్షతే భువి మీద
అవధరింపుమయ్య! ఆర్షపుత్ర!

# అభిప్రాయవేదిక

ఆధ్యాత్మిక ప్రవృత్తి కలుగుటయే అదృష్టము; అందులో వేదాంతము ఉపాసించటం మరింత విశేషం: ఉపాసించిన తత్వాన్ని ఆచరించటం సుకృత విశేషం. ఈ మూడూ త్రివేణీసంగమంలా అమరిన డా॥ నారాయణగారి రచన వట్టి వ్రాతలు గావు: అనుభవం నుండి వెలువడిన అమృత వాక్సుధా ధారలు.

("అమర వాక్సుధాస్రవంతి" నుండి)

–డా॥జి.వి. సుబ్రహ్మణ్యం

Sri Narayana is sincerity incarnate, and his thoughts have a subtle quality of anxious love for the humanity, the neglected and the persecuted.

There is a cascading rhythm of spontaneity, all along and his familiarity with the upanishadic truths adds flashes of ecstasy and surprises of beauty to the march of ideas in his works.

(From "The Sands of Time")

-H.H. Swamy Chinmayananda

శ్రీ నారాయణగారి భావవ్యక్తీకరణము స్పష్టము, విశిష్టమునై యొప్పారుచున్నది.

("ఆత్మదర్శనము" నుండి)

–డా॥ దివాకర్ల వేంకటావధాని

శ్రీ నారాయణగారిలో సత్వగుణం అధికం. అది తత్వానుశీలనకు దారి చూపింది. ఒక అభిప్రాయం గుండెను తట్టినపుడు, ఒక సన్నివేశం కంటి అంచుల్ని ముట్టినప్పుడు ఆయన కలం పలుకుతుంది.

– డా॥ సి.నారాయణరెడ్డి

పొల్లు తూర్పార బట్టి విత్తనాలను వింగడించి వేరుచేసి వాడగల నేర్పు, యుగయుగాలు చిలుముపట్టిన పాత పాత్రలను తళతళలాడేటట్టు తోమి



పరిశుభ్రముచేసి చూపించగల నేర్పు, 'అంగ వ్రాతములో చికిత్సకుడు దుష్టాంగము ఛేదించి శేషాంగ శ్రేణికి రక్షచేయు క్రియ, కాలదోషము పట్టిన సంప్రదాయాలకు సాదరముగా వీడ్కోలు చెప్పగల ధైర్యసాహస శీలము వారి ప్రసంగ వాక్యాలలో తామరతంపరలై కన్పిస్తాయి.

("అమర వాక్సుధాస్రవంతి" నుండి)

– డా॥ నందూరి రామకృష్ణమాచార్య

శ్రీ నారాయణగారి భావావిష్కరణ రీతి చాలా మట్టుకు సహజోక్తులకూ, స్వభావోక్తులకూ ఆటపట్టు. సత్యదృష్టినీ, ధర్మపుష్టినీ, పుక్కిలించే వీరి ఆలోచనాధార, అలతి అలతి పలుకులతో అరటిపండొలిచి అరచేతిలో పెట్టునట్లు అమర్చిన వీరి నిసర్గ మధురమైన రచనాధోరణి తత్త్వదర్శనాసక్తులను తప్పక అలరింప జేస్తాయి.

("అమర వాక్సుధాస్రవంతి" నుండి)

– ఆచార్య తూమాటి దొణప్ప